క్లుప్తంగా

నిరసన దీక్షకు బీసీ సేన మద్దతు



దీక్షలో కూర్చున్న బీసీ సేన నాయకులు

షాద్‌నగర్: ఎస్సీ వర్గీకరణ అమలు చేసేవరకు గ్రూప్స్ పరీక్షల ఫలితాలు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన నిరసన దీక్షకు బీసీ సేన నాయకులు మద్దతు తెలిపారు. బుధవారం దీక్షా శిబిరానికి వెళ్లిన బీసీ సేన జిల్లా ఉపాధ్యక్షుడు ప్రశాంత్ ముదిరాజ్ మాట్లాడుతూ.. మాదిగ హక్కుల కోసం నిరంతరం పోరాటం కొనసాగుతుందన్నారు. వర్గీకరణ అమలు చేయకుండా పరీక్షల ఫలితాలు విడుదల చేయడంతో మాదిగలకు అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో బీసీ సేన తాలుకా అధ్యక్షురాలు బాస వరలక్ష్మి, నాయకులు చెరుకు మమత, నవనీత, బాలమణి, శకుంతల, లక్ష్మీగౌడ్, సరస్వతీ తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌లో రెండోరోజు..

మొయినాబాద్: ఎస్సీ వర్గీకరణ పూర్తయి రిజర్వేషన్ల పరంగా వాటాలు తేల్చేవరకు ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టొద్దనే డిమాండ్‌తో ఎమ్మార్పీఎస్ నాయకులు రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నారు. అందులో భాగంగా రెండోరోజు బుధవారం మొయినాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొండిగారి మహేందర్‌మాదిగ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు

కేశంపేట: అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో బుధవారం మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌ల ఇళ్లకు పోలీసులు ఉదయమే వెళ్లి అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పలువురు మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ.. ప్రభుత్వం పోలీసులతో అక్రమంగా అరెస్టులు చేయించడం సరికాదన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు తాము సొంత నిధులు వెచ్చించామని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా వినియోగదారుల హక్కుల దినోత్సవం



మాట్లాడుతున్న గోపాల్‌నారాయణ

షాద్‌నగర్‌రూరల్: అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని బూర్గుల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వినియోగదారుల సంఘం వైస్ చైర్మన్ దిడ్డి గోపాల్‌నారాయణ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు వినియోగదారుల హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. దుకాణాల్లో కొనుగోలు చేసిన ప్రతీ వస్తువుకు విధిగా రసీదు తీసుకోవాలన్నారు. చాలా వస్తువులు కల్తీ అవుతున్నాయని, వాటిని గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తాం

కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్



కర్నూల్ మార్కెట్ వద్ద కమిటీ సభ్యులు

చేవెళ్ల: రైతులకు అన్ని విధాలుగా ఉపయోగపడేలా మార్కెట్‌ను అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తున్నట్లు కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్ అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులందరూ కలిసి బుధవారం ఏపీలోని కర్నూల్, అనంతపురం, మదనపల్లి వ్యవసాయ మార్కెట్లను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అక్కడ మార్కెట్ తీరు, పరిస్థితులను అధ్యయనం చేసినట్లు తెలిపారు. మార్కెట్ అభివృద్ధికి తీసుకోవాల్సిన పద్ధతులను తెలుసుకున్నామన్నారు. కార్యక్రమంలో సభ్యులు రాములు, జనార్దన్, కృష్ణారెడ్డి, మల్లేశ్, వెంకట్‌రెడ్డి, సుదర్శన్, సత్యనారాయణ, యాదిరెడ్డి, నరేందర్, యాదమ్మ, హనీఫ్, బాలయ్య తదితరులు ఉన్నారు.



బీటీకి సిద్ధంగా ఉన్న చేగూరు-సింబయాసిస్ యూనివర్సిటీ డబుల్‌రోడ్డు



షాద్‌నగర్ నుంచి బండోనిగూడ వెళ్లే డబుల్ రోడ్డులో నిర్మిస్తున్న కల్వర్టులు

అధ్వాన రోడ్లకు మోక్షం

- ముమ్మరంగా బీటీరోడ్ల నిర్మాణ పనులు
- ఎమ్మెల్యే చొరవతో నిధులు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఆయా గ్రామాల ప్రజలు

నందిగామ: మండలంలోని అధ్వాన రోడ్లకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ప్రజలు, వాహనదారుల ఏళ్ల కళ నెరవేరింది. అటు మొదళ్లగూడ నుంచి చేగూరుకు, ఇటు షాద్‌నగర్ నుంచి వీర్లపల్లి, వెంకమ్మగూడ, చేగూరు వరకు డబుల్ రోడ్డుకు స్థానిక ఎమ్మెల్యే చొరవతో నిధులు మంజూరుకావడంతో బీటీరోడ్డు పనులు జోరుగా కొనసాగుతున్నాయి. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సింబయాసిస్ యూనివర్సిటీ నుంచి చేగూరు వరకు..

మొదళ్లగూడ సమీపంలోని సింబయాసిస్ అంతర్జాతీయ యూనివర్సిటీ నుంచి చేగూరు వరకు సీఆర్ఆర్ నిధులు రూ.7కోట్ల వ్యయంతో డబుల్ బీటీరోడ్డు నిర్మాణ పనులను జనవరి 4న పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. వెంటనే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషితో పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం రోడ్డు విస్తరణ పూర్తి చేయడమే కాకుండా కంకరపరిచి బీటీ వేయడానికి సిద్ధం చేశారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయి నట్లయితే అటు షాబాద్ మండలం నుంచే కాకుండా మామిడిపల్లి, శ్రీనివాసులగూడ, మొదళ్లగూడ, ఈదులపల్లి, మోత్కులగూడ, సింబయాసిస్ యూనివర్సిటీకి రాకపోకలు కొనసాగించే వారికి సులభతరంగా ఉంటుంది.

షాద్‌నగర్ నుంచి బండోనిగూడ వరకు..

షాద్‌నగర్ నుంచి నందిగామ మండలం బండోనిగూడ వరకు ప్రస్తుతం ఉన్న సింగిల్ రోడ్డు స్థానంలో డబుల్ బీటీరోడ్డుగా మార్చేందుకు సీఆర్ఆర్ నిధులు రూ.19.4 కోట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఆ రోడ్డు పనులు జోరుగా కొనసాగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా మట్టిపోయడం, కల్వర్టులను నిర్మించడం తదితర పనులు జరుగుతున్నాయి. ఈ రోడ్డు నిర్మాణం సైతం పూర్తయితే బండోనిగూడ, చేగూరు, వెంకమ్మగూడ, వీర్లపల్లి తదితర గ్రామాల ప్రజలకు రాకపోకలు కొనసాగించేందుకు సులువుగా ఉంటుంది.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



గత కొన్నేళ్లుగా షాద్‌నగర్ నుంచి చేగూరుకు సక్రమంగా రోడ్డు లేకపోవడంతో షాద్‌నగర్ వెళ్లాలంటే తీగాపూర్, పారిశ్రామికవాడ, నందిగామ మీదుగా వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం డబుల్ బీటీరోడ్డు పనులు పూర్తయితే కేవలం 15 నిమిషాలలో షాద్‌నగర్‌కు వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. రోడ్డుకు నిధులు మంజూరు చేయించి, వాహనదారుల ఇబ్బంది తీర్చేందుకు కృషి చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కృతజ్ఞతలు.

– శివశంకర్‌గౌడ్, మాజీ ఎంపీపీ

బడ్జెట్‌లో విద్యకు నిధులు కేటాయించాలి

ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాశ్‌నాయక్



మాట్లాడుతున్న ఆకాశ్‌నాయక్

షాద్‌నగర్: బడ్జెట్‌లో విద్యారంగాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాశ్‌నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని గిరిజన బాలికల కళాశాల వసతి గృహాన్ని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై పదిహేను నెలలు అవుతున్నా విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించలేదని ఆరోపించారు. ఫలితంగా పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాశ్, శ్రీను, రాజేశ్, పద్మ, అనూష, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

మాజీ వైస్ ఎంపీపీ నరేందర్‌రెడ్డి



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న నరేందర్‌రెడ్డి, నాయకులు

షాద్‌నగర్: గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని మాజీ వైస్ ఎంపీపీ బసిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కంసాన్‌పల్లి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు రూ.10లక్షలు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.7లక్షలతో మాజీ సర్పంచ్ పద్మ ఆధ్వర్యంలో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను బుధవారం నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్ రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శేఖర్, పంచాయతీ సెక్రటరీ రాజునాయక్, నాయకులు నర్సింలు, బాలవర్ధన్‌రెడ్డి, కృష్ణయ్య, రవి, కుమార్, యాదయ్య, వెంకటయ్య, కృష్ణయ్య, వాహెబ్, లక్ష్మయ్య, సత్యం, ప్రశాంత్‌రెడ్డి, వాహీద్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

హిందువులందరూ భగవద్గీత చదవాలి

భగవద్గీత ఫౌండేషన్ చైర్మన్ గంగాధర శాస్త్రి



గంగాధర శాస్త్రిని సన్మానిస్తున్న సేవా ఫౌండేషన్ సభ్యులు

శంకర్‌పల్లి: భగవద్గీతను హిందువులందరూ చదివి, ఇతరులకు దాని గొప్పతనాన్ని వివరించాలని భగవద్గీత ఫౌండేషన్ చైర్మన్ గంగాధర శాస్త్రి సూచించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి, ఘనంగా సన్మానించారు. అనంతరం గంగాధర శాస్త్రి మాట్లాడుతూ.. ప్రస్తుతం చాలా మంది హిందూ ధర్మాన్ని మరిచిపోతున్నారని, మహిళలు బొట్టు పెట్టుకోకుండా, విదేశీ సంస్కృతిని అనుసరించడంతో సనాతన హిందూ ధర్మం నాశనమవుతుందని ఆరోపించారు. దీనిపై ప్రతి ఒక్కరూ ఆలోచించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఇంట్లో భగవద్గీత ఉండాలని, దానిలోని శ్లోకాలను పఠించాలని కోరారు. కార్యక్రమంలో సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు నరేశ్, ఉపాధ్యక్షుడు జైరాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి వేణేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు న్యాయం చేయాలి

సీపీఎం జిల్లా నాయకుడు భాస్కర్



కొండకల్‌లో గిరిజనులకు మద్దతు తెలుపుతున్న సీపీఎం నాయకులు

శంకర్‌పల్లి: మండలంలోని కొండకల్‌తండాలో గత 61 రోజుల నుంచి రిలే నిరాహార దీక్షలు చేపడుతున్న గిరిజనులకు సీపీఎం జిల్లా నాయకుడు కాడిగళ్ల భాస్కర్ బుధవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ.. గిరిజనులు ఇన్ని రోజులుగా దీక్ష చేపడుతున్నప్పటికీ ఉన్నతాధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య ప్రభుత్వం నడుస్తోందా.. నియంతృత్వ పాలన నడుస్తోందా అని ప్రశ్నించారు. గిరిజనులు ఏళ్లుగా సాగు చేసుకుంటున్నా భూములు ప్రైవేట్ కంపెనీలు లాక్కొంటుంటే సర్కారు ఏం చేస్తోందన్నారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి, సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి తెల్లరేషన్‌కార్డులు

- ఎమ్మెల్యే కాలె యాదయ్య
- నూతన లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీ ప్రారంభం



లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, అధికారులు

చేవెళ్ల: ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన ప్రతీ ఒక్కరికి తెల్లరేషన్‌కార్డులను అందిస్తున్నట్లు ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మున్సిపాలిటీలో బుధవారం కొత్తగా వచ్చిన రేషన్ కార్డుల లబ్ధిదారులకు కార్డులు, బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దశలవారీగా అన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తామని తెలిపారు. మండలంలో మొత్తం 765 తెల్లరేషన్‌కార్డులు వచ్చాయని, వీటికి సంబంధించిన లబ్ధిదారులకు ఈ నెల నుంచి రేషన్ బియ్యం అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో ఇంకా అర్హులను గుర్తించి కార్డులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, తహసీల్దార్ కృష్ణయ్య, పీఏసీఎస్ చైర్మన్లు గోనే ప్రతాప్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, నాయకులు వీరేందర్ రెడ్డి, కృష్ణారెడ్డి, రాములు, ఆగిరెడ్డి, గోపాల్‌రెడ్డి, మల్లేశ్, లక్ష్మారెడ్డి, జనార్దన్, షాబాద్ దర్శన్, రాంరెడ్డి, మహేందర్, తిరుపతిరెడ్డి, సునీల్, దయాకర్ తదితరులు ఉన్నారు.

పరిహారం చెల్లించకుంటే అసెంబ్లీ ముట్టడిస్తాం

భూనిర్వాసితుల సంఘం మండల అధ్యక్షుడు నీరటి ఆంజనేయులు

షాబాద్: చందనవెళ్లి భూ నిర్వాసితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించకుంటే అసెంబ్లీ ముట్టడిస్తామని భూనిర్వాసితుల సంఘం మండల అధ్యక్షుడు నీరటి ఆంజనేయులు పేర్కొన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని చందనవెళ్లి భూనిర్వసితులు నగరంలోని అసెంబ్లీ ముట్టడించారు. వీరిని పోలీసులు అదుపులోకి తీసుకొని రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కొని, అసలైన రైతులకు నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క షాబాద్‌లో పాతయాత్ర చేసినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భూనిర్వాసితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చి, 15 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు న్యాయం జరగలేదని వాపోయారు. గత పాలకుల మాదిరిగానే ఈ ప్రభుత్వం రైతులను అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో రైతుల సమస్యలను లేవనెత్తి మాకు న్యాయం చేయాలని కోరారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూనిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని, లేదంటే భూనిర్వాసితులంతా ఏకమై సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. భూనిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించేవరకు తమ పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు గూడూరు జంగయ్య, ప్రధాన కార్యదర్శి పంతులు అనంతం, ఉపాధ్యక్షులు రెడ్డయ్య, నర్సింలు, భూనిర్వాసితులు రాంబాబుగౌడ్, దయాకర్, బాలయ్య, కృష్ణగౌడ్ తదితరులు ఉన్నారు.

నిరుపేదల కలలను సాకారం చేస్తాం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



షాద్‌నగర్: హాజిపల్లిలో ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి వారి కలలను సాకారం చేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని హాజిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. గూడు లేని నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించిందన్నారు. అన్ని గ్రామాల్లో అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇస్తుందన్నారు. ఖాళీ స్థలం ఉండి ఇళ్లు కట్టుకోవాలనుకునే పేదలకు ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు. ఇళ్ల నిర్మాణానికి గాను లబ్ధిదారులకు విడతల వారీగా ప్రభుత్వం వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తుందన్నారు. రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన నాయకులు ఎక్కడా పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు పూర్తిగా కట్టుబడి ఉండి మేనిఫెస్టోలో పొందుపర్చిన ప్రకారం హామీలను అమలు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, రఘునాయక్, ఇబ్రహీం, తుపాకుల శేఖర్, సుదర్శన్, విష్ణు, ఎంపీడీఓ బన్సీలాల్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

నందిగామ: అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు అందిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని అప్పారెడ్డిగూడలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన బుధవారం ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ చేశారు. అప్పారెడ్డిగూడ గ్రామానికి 38 ఇళ్లు మంజూరు కావడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుమతి, మాజీ ఎంపీపీ శివ శంకర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహా యాదవ్, మాజీ సర్పంచ్‌లు మల్లేశ్, కృష్ణయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యులు దేపల్లి కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ నర్సింహ, మాజీ ఉపసర్పంచ్ సీతారాం, నాయకులు చిందం నర్సింహా, సత్యనారాయణ, యాదయ్య, ప్రభాకర్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

కొత్తూరు: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని మక్తగూడ గ్రామంలో ఆయన బుధవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. గత పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రానికి పెద్దగా చేసిందేమి లేదన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి లీనా, ఎంపీడీఓ అరుంధతి, నాయకులు శివశంకర్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, రాందాస్ నాయక్, ప్రభాకర్, శేఖర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, జంగ నర్సింలు, కృష్ణ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

షాద్‌నగర్: జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీయూడబ్ల్యూజే మఫిషియల్ వెల్ఫేర్ కమిటీ కన్వీనర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం షాద్‌నగర్‌లో సంఘం నాయకుల ముఖ్య సమావేశాన్ని నిర్వహించారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా కమిటీలో వివిధ పదవులకు ఎన్నికైన జర్నలిస్టులను సత్కరించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. తమ సంఘం జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తోందన్నారు. త్వరలో డివిజన్‌స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. సంఘంలో సభ్యత్వం పొందిన జర్నలిస్టులకు ఐదు లక్షల బీమా సౌకర్యం కల్పించారని, ఇందుకు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తనయుడు కార్తీక్‌రెడ్డి సహకారం అందించడం హర్షణీయమన్నారు. టీయూడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడిగా షాద్‌నగర్‌కు చెందిన చెక్కల శ్రీశైలం, సంయుక్త కార్యదర్శిగా రాఘవేందర్, ప్రింట్ మీడియా ఉపాధ్యక్షుడిగా కొనియాల భాస్కర్, కార్యదర్శిగా రమేశ్ ఎన్నికయ్యారు.

వైద్య శిబిరాలతో పేదలకు మేలు

మొయినాబాద్ రూరల్: ఉచిత వైద్య శిబిరాలు నిరుపేదలకు ఎంతో దోహదపడతాయని శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి తనయుడు పార్టీ జిల్లా నాయకుడు రినీశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామంలో పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా రినీశ్‌రెడ్డి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో బండ్లగూడ సన్‌సిటీ మాజీ కార్పొరేటర్ శ్రీనాథ్‌రెడ్డి, అమ్డాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ జి.నర్సింహారెడ్డి, మండల విశ్వకర్మ మాజీ అధ్యక్షుడు నర్సింహాచారి, నాయకులు మన్నె ప్రభాకర్‌రెడ్డి, మాడి విక్రమ్ రెడ్డి, సామ మాధవరెడ్డి పాల్గొన్నారు.

రసాయనాల వాడకం తగ్గించాలి

భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కోశాధికారి మాణిక్‌రెడ్డి

శంకర్‌పల్లి: రైతులు రసాయనాల వాడకం తగ్గించి, సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కోశాధికారి మాణిక్‌రెడ్డి సూచించారు. ఏప్రిల్ 4, 5తేదీల్లో 'ప్రకృతి-సేంద్రియ రైతుల సమ్మేళనం 2025' అనే కార్యక్రమాన్ని శంకర్‌పల్లి పట్టణంలో నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన కరపత్రాన్ని బుధవారం పట్టణ ప్రభుత్వ అతిథి గృహంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్, కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ రానున్నట్లు వెల్లడించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయంలో రసాయనాల వాడకం తగ్గించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, లేకపోతే మానవాళి మనుగడ ప్రశ్నార్థకమయ్యే అవకాశం ఉందన్నారు. పట్టణంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి రైతులు పెద్దఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పరమేశ్వర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, నాగిరెడ్డి, శ్రీనివాస్, రామ్మోహన్, శ్రీపాల్‌రెడ్డి, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి



బోనంతో జోగిని పావని

మొయినాబాద్‌రూరల్: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత పొందుతారని మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఎన్కెపల్లి గ్రామంలో ఎలిగని మహేశ్‌గౌడ్ సొంత డబ్బుతో నూతనంగా రేణుకా ఎల్లమ్మ దేవాలయాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా దేవాలయంలో రెండురోజుల పాటు ప్రత్యేక పూజలు జరగనున్నాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఉదయం రేణుకా ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అదేవిధంగా సాయంత్రం అమ్మవారి బోనాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఆలయ నిర్మాణ దాత ఎలిగని మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో జోగిని పావని బోనం ఎత్తి భక్తులను ఎంతో అలరింపజేశారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి సమర్పించారు. ఊరేగింపులో డీజే చప్పుళ్లు, డిల్లం బల్లెం, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొత్తపల్లి అమర్‌నాథ్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్సీ, నాయకులు

షాద్‌నగర్: మతసామరస్యానికి ప్రతీక రంజాన్ అని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని షాద్‌నగర్ పట్టణ చౌరస్తాలో ఉన్న మజీద్‌లో చిల్కమర్రి మాజీ సర్పంచ్ పల్లె శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ విందుకు ఎమ్మెల్సీ, మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అల్లాహ్ దయతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.